# పాదరక్షల శిక్ష ★

రచన :
శ్రీ 'గంజన్మోరా'

శ్రీ వేంకటేశ్వరాలయ ప్రాంగణంలో దైవభక్తిని గూర్చిన ఉపన్యాసం చాలా జోరుగా సాగుతున్నది. దైవశక్తిని భక్తితో అనుభూతి పొంది తెలుసుకొనగలరే గాని, త్రికరణ శుద్ధిలేకుండా కేవలం పంచేంద్రియ జ్ఞానంతో తెలుసుకొనలేరని, వక్త ఉద్బోధిస్తున్నాడు. మనస్సుల సంగతి దేవుడెరుగు గాని మనుషులు నిశ్శబ్దంగా ఉపన్యాసం వింటున్నారు. వింటున్నారనటం కంటే వింటున్నట్లుగా కనిపిస్తురన్నది, ఆ భక్తుల బృందంలో పరధ్యాన్నంగా కూర్చున్నాడు మన చిన్న కథకు నాయకుడు కాబోతున్న మన్మథరావు. మరి అతని పరధ్యాన్నానికి కారణం చెప్పులు. ఏభై నాలుగు రూపాయల చిల్లరతో నిన్ననే ఏరికోరి కొన్నాడు చక్కని లెదర్ చెప్పులు. మనిషి కాస్త పిసినారి మరి కాస్త అనుమాని కావటంతో అందరిలా గుడి ముందు కూర్చున్న బిచ్చగాళ్ళ దగ్గర చెప్పులుంచిరాలేదు.

గుడి ప్రాకారంలో రాతి అరుగు క్రింద కొందరిలా తనూ చెప్పులు విడిచివచ్చి కూర్చున్నాడు.

ఆ కొందరి సంగతి మన కనవసరం, మన కథానాయకుడవుతున్న మన్మథరావు మనస్సుమాత్రం చెప్పుల మీదకు పరుగు తీస్తున్నది.

నిన్ననే కొన్న కొత్త చెప్పులు కావటంవలన సహజంగా ఆ ఆలోచన అందరికీ వుంటుందని మనం సరిపెట్టుకుంటే సరికాదు. మరో కారణం యేమిటంటే బంగారంలాంటివని మన్మథరావు భావించే చెప్పులు నిన్న రామాలయం ముందు అలవాటుగా విడిచి వెళ్ళిపోగొట్టుకోవటం. గుడి ముందు బెగ్గర్సుంటారు గదండీ! పది పైసలతో రక్షించుకొని బయట పడొచ్చు గదండి. అని సదరు కథానాయకుని ధర్మపత్ని సలహా! దానికి సమాధానంగా, ఎన్నడో ఓ రోజు ఆనాటి అలవాటుగా దాచిపెట్టమని ఇచ్చిన చెప్పులతో ఒంటి బిచ్చగాడు కాస్త మాయమయ్యాడని, నాటి నుండి కాళ్ళుకళ్ళు లేని ముసలి బిచ్చగాళ్ళను కూడా నమ్మలేక పోతున్నానని నానా తిట్లు తిట్టి (భార్యను కాదండి బిచ్చగాళ్ళను) చెప్పాడు మన్మదరావు.

తరువాత ఈ దంపతుల సంభాషణ కూడా మన కనవసరం. వక్తగారి చుత్తి ధాటికి తట్టుకోలేని శ్రోతలు కొందరు చెవులు దులుపుకొని వెళ్ళుతున్నారు. చిలు మొదిలించు కోవటానికి కొందరు కొత్తవారు వస్తున్నారు. ఈరాక పోకలను కూడా గమనించటం లేదు మన హీరో.

మనో నేత్రం ముందు చెప్పులు మాత్రం కదులాడుతున్నాయి. మానసిక క్షోభ తీవ్రస్థాయికి చేరుకుంది. సడన్‌గా లేచాడు. సర్ మని పాటు చిరిగిన ద్యాస కూడా మరిచాడు. రాతి అరుగు దగ్గరి కెళ్ళిన మన మన్మథరావు గుండె గుబేలుమన్నది. చెప్పులు కనిపించలేదు. చూసిన చోటనే మళ్ళీమళ్ళీ చూస్తూ అటూఇటూ తిరిగాడు. పరిచితులు కనిపిస్తే అడిగాడు. ఎవరి ధ్యాస వారిది.

కనీసం సానుభూతి పలికే స్థితిలో లేరు. కంటి వెంట నీరు కనిపించలేదనేగాని మన్మథరావు మధన మాటల కందని స్థాయికి చేరుకుంది. బాధతో కూడిన తిట్ల శాపనార్థాలతో పెనవేసుకున్న మనస్సు మౌన ఘోషలో మునకలేస్తుంది.

ఇప్పుడు మన హీరోకు వోదార్పు మాటలు కావాలి. కాని చెప్పేదెవరు? భార్య పక్కనున్న బాగుండేది. అర్ధగంటలో వంటజేసి నేనూ కూడా వస్తానంటే నీ శింగారం పూర్తయ్యేసరికి ఆ కాస్త ఉపన్యాసం ముగుస్తుందని భార్య అభ్యర్థన తిరస్కరించి వచ్చిన మన హీరో ఖర్మ ఈ విధంగా దాపురించింది. ఖర్మంటే గుర్తొస్తున్నది.

నిన్న చెప్పులు పోయిన విషయం శ్రీమతికి చెప్పుకున్నప్పుడు మీకని పోయింది లెండి. అంతా మన ఖర్మ అంటూ ఖర్మ సిద్ధాంతాన్ని ప్రవచించి మన్మథరావు మనోవ్యథను ఉపశమింప జేసింది.

భార్య ప్రక్కన లేని మన హీరోకు ప్రస్తుతం భగవంతుడే దిక్కయినాడు. ధ్వజ స్థంబం దగ్గరికి నడిచాడు

భక్తి ప్రపత్తులతో ముకుళిత హస్తుడై మౌనంగా-

"ఆపద్బాంధవా! అనాథరక్షకా! శ్రీనివాసా!" అంటూ నామావళి పఠించాడు.

దేవా! ఏమిటీ నా ఖర్మ యిలా దాపురించింది. నిన్న ఓ జత పోగొట్టుకున్నా. మళ్ళీ ఈ రోజు మరో జత. ఆరవ మొక్కు అవాడా? నా చెప్పులు తిరిగి మళ్ళీ నాకు దొరికితే ఆ చెప్పుల ధరలో సగం నీ హుండీలో వేస్తా. ఇక ఈ భక్తుని ఆపదను బాపి రక్షించు దేవా! అంటూ కండ్లు రెండూ మూసుకున్నాడు.

ఆ చెప్పులు ఇక దొరకవనే మన భక్త హీరో ఆ మొక్కు మొక్కాడనేది నిజం. అయినా భగవంతుడికే ఓ పరీక్ష పెట్టాడనుకుందాం. మరి మన హీరోకు చెప్పులు లేకుండా నడవటం చేతగాదు అందుకే ప్రదక్షిణ చేసేటప్పుడు ఎక్కడ క్రింద పడతానోనని భయపడతాడు (పాపం) ఉత్త కాళ్ళతో ఇంటికెట్లా వెళ్ళాలా! అని సతమత మవుతున్నాడు.

నిన్న పరిస్థితి వేరు. జేబులో డబ్బులు ఉన్నయ్. మరో జత వెంటనే (అంటే అర్ధగంట వెతికి చూసుకోనే లేండి) కొని తొడుక్కున్నాడు. మరి ఈ రోజు రిక్షా డబ్బులు కూడా జేబులో లేవు. భగవంతు దేమన్నా బావించనీ అంటూ అరుగు దగ్గర కెళ్ళి తనకు సరిపడే ఓ జత స్లిపర్స్ తగిలించుకొని భయభయంగా ఆలయం వీడి నడక సాగించాడు రామాలయం వైపు. కనీసం వారానికోసారి ఆంజనేయస్వామి గుడి మొదలుకొని శివాలయం వరకు ఉన్న నాలుగు దేవాలయాలను దర్శించి వెళ్ళటం మన మన్మథరావుకు అలవాటు. రామాలయ ప్రాంగణంలోనికి ప్రవేశించాడు.

అలవాటుగా చెప్పులు విడిచేవైపు నడిచాడు. మన్మథరావు, నిజంగా అదృష్టవంతుడో లేక భగవంతుడు కరుణించి అనుగ్రహించాడో తెలియదుగాని-

అర్ధగంట క్రితం ఆ గుళ్ళో కనిపించని తన చెప్పులు ఇక్కడ సాక్షాత్కరించాయి. గుళ్ళో కెళ్ళి మళ్ళీ వచ్చేలోపల మాయమవుతాయనే భయంతో స్లిపర్స్ అక్కడ వదిలి ఆ చెప్పులు తొడుక్కొని రామాలయం వీడి శివాలయం వైపు నడక సాగించాడు. మన హీరో కాస్త పిసినారి కావటం వలన అప్పుడే భగవంతుని ముడుపు విష





# Santhi Diamonds

Prop: B. K. N. Kannan & B. K. Rajaram

37, Big Sowrastra Street,

TIRUCHIRAPALLI - 620 008.

★

మేము అత్యుత్తమమైన టెర్లీన్ స్టార్ డబుల్ కటింగ్,

సాంతిస్టార్ కమలములు మీ నగలకు అతి ప్రకాశాన్ని చేకూర్చేరీతిగా

తయారిస్తున్నాము.

రసాయనిక వజ్రాలను తయారించుటలో

మాదొక ప్రత్యేకత.




యం గూర్చి ఆలోచన చేస్తూ చిన్నగా నడక సాగి స్తున్నాడు.

ఇది యాదృచ్ఛికంగా జరిగిన సంఘటన ఇందులో దేవుని ప్రమేయమేముంది? ఒక వ్యక్తి ద్వారా అవి అక్కడకు చేరినవి. నేను మొక్కినా మొక్కకపోయినా నా చెప్పులు తప్పక నాకు దొరికేవి. కేవలవాటుగా రామాలయానికి వెళ్ళబట్టేగా నా చెప్పులు నాకు దొరికనవి, అనే ఆలోచన మనస్సులో తీగలాగా సాగసాగింది.

ఓరి మన్మధరావు! నీవు భగవంతుని ప్రమేయం లేకుండానే చెప్పులు దొరికాయని మురిసిపోతున్నావు. ఆ చెప్పులు తీసుకెళ్ళిన మనిషిని ఇక్కడకు రప్పించినది నీవు వచ్చేవరకు ఆ చెప్పులు ఇక్కడ వుండటానికి పాటు పడినది ఆ భగవద్శక్తే అని మరచి పోతున్నావు అంటూ మన్మధరావుకు అంతరాత్మ బోధ చేయ సాగింది.

ఆ బోధ అంతగా రుచించలేదు మన హీరోకు. దైవ శక్తి పనిచేసిందో లేదో నా కనవసరం మానవశక్తి లేందే దానికి విలువలేదు కదా? సగం నా కృషి కూడా ఉండ బట్టే నా చెప్పులు దొరికాయి. అని తన అంతరాత్మ ప్రబోధాన్ని అత్యుపెట్టకుండా తన సిద్ధాంతాన్ని సమ ర్ధించుకొంటూ నడకసాగాడు.

ఓరి మూర్ఖా! అసలు నిన్నెవరు మొక్కమన్నారు ఆ మొక్కు తీర్చమని నిన్ను భగవంతుడడుగుతున్నాడా అసలు నీకు భగవంతుడంటే భక్తిగాదు కాని భయం ఉన్నది అందుకోసమే పిసినారి బుద్ధితో సతమత అవు తున్నావు. అని రకరకాలు అంతరాత్మ విమర్శిస్తుంటే మన హీరో తాళలేక పోతున్నాడు. చివరకు మానవ శక్తి దైవశక్తి రెండను సరిసమానమైనవే భగవంతు నితో పాటు నేను సగం కష్టపడ్డాను కాబట్టి సగం డబ్బు మాత్రమే హుండీలో వేస్తానని అంతరాత్మకు చెప్పుకున్నాడు.

ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత మన మన్మధరావు బుద్ధి కాస్త శాంతించినది. మెయిన్ రోడ్డు దాటి శివాలయం వీధిలో నడుస్తున్నాడు ఓ ఇంటి గేటు నుంచి అకస్మా త్తుగా ఓ బొచ్చుకుక్క భౌభౌ మంటూ మన హీరో మీదికి రాసాగింది. మన్మధరావు గుండె వేగం తృటిలో డబుల్ అయింది. శరీరం వణక సాగింది. భయం తీవ్ర

స్థాయికి చేరుకోవటం, లేని పిక్క బలం తెచ్చుకొని పరుగు లంఘించటం ఒకేసారి జరిగాయి.

ఆ పరుగు తొందరలో ఎడంకాలి చెప్పు జారి జారి పడిపోయింది. ప్రాణభయంలో మన హీరోకే కాదు మనకు మాత్రం చెప్పుల ధ్యాస ఉంటుందా మరి. అదే పరుగుతో శివాలయం చేరుకున్నాడు.

పక్క అరుపు మనిషి పరుగు అలికిడి విన్న ఆ ఇంటి యజమాని బయటకు రావటం తన పెంపుడు కుక్కన్ని పిలుచుకోవటం కూడా అంత వేగంగానే జరిగాయి.

కాని ఈ సంగతి మాత్రం మన కథానాయకుడు పట్టించుకోలేదు. వెనుక పక్క వస్తున్నదన్న ధ్యాసతోనే శివాలయం వరకు పరుగుతీసాడు. అవయవాలన్నీ సరిగ్గావుండి కూడా పరుగు తీయలేని మనిషి భయంతో పరుగుదీస్తాడనేది మన్మథరావు చేసి చూపించాడు. ఆయాసంతో రొప్పుకుంటూ వెళ్ళి శివాలయం మెట్లు మీద చతికిల బడ్డాడు. యధృచ్ఛికంగా జరిగిన ఈ సంఘటన మన్మథరావు మనస్సుపై విపరీత ప్రభావం చూపించింది. కుడికాలుకున్న చెప్పు తీసి పట్టుకున్నాడు.

రామాలయం నుండి శివాలయానికి వచ్చే దోవలో తను అనుకున్న విషయాల్ని సింహావలోకనం చేసుకున్నాడు. శ్రీ వేంకటేశ్వరాలయంలో ఉపన్యాసకుడు చెప్పిన విషయం మన్మథరావు మనస్సులో తళుక్కున మెరిసింది.

నిజమే! దైవ శక్తిని భక్తితో అనుభూతి పొంది తెలుసుకో గలమేగాని త్రికరణ శుద్ధి లేకుండా కేవలం పంచేంద్రియ జ్ఞానంతో తెలుసుకోలేము. దేవుడా! క్షమించరాని అపరాధం చేసాను. ఇక ముందెన్నడూ ఇటువంటి తుచ్ఛమైన ఆలోచనలు చేయను. నీకు సమర్పించవలసిన డబ్బు పూర్తిగా సమర్పించుకుంటాను, నన్ను క్షమించు దేవా! అని మనస్సులో పరిపరి విధాల పశ్చాత్తప్తుడై చెంపలు వేసుకున్నాడు మన హీరో.

చెప్పు చేత బట్టుకొని నిలబడ్డాడు. అప్పుడే అక్కడికొస్తున్న ఓ వ్యక్తి మన్మథరావును, అతని చేతిలో చెప్పును నిశితంగా చూసి, "ఏమండీ! దారిలో ఓ చెప్పు కనిపించింది మీ చేతిలో ఉన్నటువంటిదే! బహుశా అది మీదే అయివుంటుందనుకుంటున్నాను" అన్నాడు. ఆ వ్యక్తి ఎవరో కాదు మన హీరో చెప్పులు రామాలయానికి చేర్చిన వ్యక్తే!

దైవికంగా తన స్లిపర్స్ తనకే చేరినందుకు భగవంతుడికి, మన హీరోకి కృతజ్ఞతలు మనసులోనే తెలియజేసుకున్నాడు మన హీరో. వెంకన్న స్వామికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ వెళ్ళి దారిలో పడ్డ చెప్పు తగిలించుకొచ్చాడు. ఇక ముందెన్నడూ దేవాలయాలకు చెప్పులు వేసుకొని రాకూడదని, వస్తే రిక్షా మీదన్నా రావాలి లేకపోతే పనికిరాని పాత చెప్పులన్నా వేసుకుని రావా అని నిర్ణయించుకున్నాడు.


కావలెను

మా ఫాక్టరీలో తయారైన జంకాళాలు, మరియు బెడ్ షీట్లు ప్రసిద్ధి చెందినవి, వాటిని ప్రతివారూ మెచ్చుకుంటున్నారు. వీటికి ప్రతినిధిగా నున్నవారు మంచి లాభము పొందుతున్నారు.

ఎల్. ఐ. సి. ఏజెంట్లు, రిటైరయిన గవర్నమెంటు పనివారినుంచి, వారు మంచి లాభం పొందుటకు దరఖాస్తులు కోరబడుచున్నాము.

: తయారుచేయువారు :

J. P. M. TEXTILES,

P. B. No. 60 : : BHAVANI - 638 301.